సాక్షి నిజామాబాద్

శనివారం । 11 । మే । 2024



కాంగ్రెస్ ప్రభుత్వం కూలడం..
ఎన్నికల తర్వాత రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం కూలిపోతుందని నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ వ్యాఖ్యానించారు.
-2లో ▸



మాఫీ చేయలేదు..
కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం రైతులకు ఒక్క రూపాయి కూడా మాఫీ చేయలేదని కర్ణాటక మంత్రి బోస్‌రాజు విమర్శించారు.
- 2లో ▸

వాతావరణం
గరిష్టం/కనిష్టం
43.6 /22.5
ఉదయం నుంచే ఎండ తీవ్రత పెరుగుతుంది. మధ్యాహ్నం వడగాలులు వీస్తాయి. ఉక్కపోతగా ఉంటుంది. రాత్రి నిర్మలంగా ఉంటుంది.

న్యూస్‌రీల్

చిన్నయానం ఓటర్లకు రవాణా సౌకర్యం

- 'సాక్షి' కథనానికి స్పందించిన కలెక్టర్

సాక్షి ఎఫెక్ట్..

డొంకేశ్వర్(ఆర్మూర్): డొంకేశ్వర్ మండలంలోని చిన్నయానం ఓటర్లకు రవాణా సౌకర్యం కల్పించాలని కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు, ఆర్మూర్ ఆర్డీవో రాజాగౌడ్, డొంకేశ్వర్ తహసీల్దార్ వెంకటరమణకు ఆదేశాలు జారీ చేశారు. చిన్నయానంలో పోలింగ్ కేంద్రం లేక ఓటర్లు పక్కనున్న గాదేపల్లికి వెళ్తున్న విషయంపై ఈ నెల 10న సాక్షి దినపత్రికలో 'ఊరొక చోట.. ఓటింగ్ మరో చోట' అనే కథనాన్ని ప్రచురించింది. ఇందుకు కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు స్పందించారు. ఓటర్లు ఇబ్బందులు పడుతున్న విషయాన్ని పరిశీలించి తగు చర్యలు తీసుకోవాలని ఆర్డీవోకు సూచించారు. నాలుగు నెలల కిందటే చిన్నయానంలో పోలింగ్ కేంద్రం అవసరమని ప్రతిపాదనలు పంపించామని, ఎన్నికల కమిషన్ నుంచి అనుమతి రాలేదని ఆయన కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. ప్రస్తుతం గ్రామంలో పోలింగ్ కేంద్రం ఏర్పాటు చేయడం సాధ్యం కానందున చిన్నయానం ఓటర్లు గాదేపల్లి పోలింగ్ కేంద్రానికి వెళ్లి ఓటు వేసేందుకు వాహనాలు సమకూర్చాలని కలెక్టర్ ఆర్డీవోకు సూచించారు. కలెక్టర్, ఆర్డీవోల ఆదేశాల మేరకు రవాణా సౌకర్యానికి చర్యలు చేపట్టినట్లు తహసీల్దార్ వెంకటరమణ 'సాక్షి'కి తెలిపారు.

నేటి సాయంత్రం నుంచి మద్యం షాపులు బంద్

ఖలీల్ వాడి: పార్లమెంట్ ఎన్నికల పోలింగ్ సందర్భంగా మద్యం షాపులు మూసివేయాలని సీపీ కల్మేశ్వర్ ఆదేశించారు. శనివారం సాయంత్రం ఐదు గంటల నుంచి 14వ తేదీ ఉదయం ఆరు గంటల వరకు మూసి వేయాలని పేర్కొన్నారు. జిల్లాలోని వైన్ షాప్‌లు, కల్లు దుకాణాలు, బార్లు, క్లబ్‌లు మూసి ఉంచాలని తెలిపారు. ఎవరైనా నిబంధనలు అతిక్రమిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

13న జిల్లాలో 144 సెక్షన్ అమలు

ఖలీల్‌వాడి: పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా ఈ నెల 13న పోలింగ్ రోజు నిజామాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో 144 సెక్షన్ అమలులో ఉంటుందని సీపీ కల్మేశ్వర్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఐదుగురి కన్నా ఎక్కువ మంది ఒకచోట ఉండకూడదన్నారు. ఎక్కువ మంది ఒకచోట ఉండాలంటే సంబంధిత అధికారి అనుమతి తప్పనిసరి తీసుకోవాలని తెలిపారు. పోలింగ్ బూత్ నుంచి వంద మీటర్ల లోపల ఉన్న ఇంటి వద్ద దగ్గర ఉన్న ఇళ్లలో బయటి వారికి షెల్టర్ ఇవ్వకూడదన్నారు. ఫంక్షన్ హాళ్లలో, లాడ్జిల్లో ఎక్కువ మందికి ప్రచారాల కోసం అనుమతి ఇవ్వొద్దని చెప్పారు.

సీఎం రేవంత్‌రెడ్డిపై ఈసీకి బీఆర్‌ఎస్ ఫిర్యాదు

ఆర్మూర్: ఎన్నికల కోడ్ ఉల్లంఘిస్తూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధికార దుర్వినియోగానికి పాల్పడ్డాడని ఆరోపిస్తూ బీఆర్‌ఎస్ పార్టీ జనరల్ సెక్రెటరీ శ్రీనివాస్‌రెడ్డి భారత ఎన్నికల సంఘం ప్రధాన కార్యదర్శి అవినాష్ కుమార్‌కు శుక్రవారం ఫిర్యాదు చేశారు. ఆర్మూర్‌లో ఆర్టీసీ స్థలం లీజుకు తీసుకొని మాజీ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి కుటుంబ సభ్యులు నిర్మించిన మాల్‌పై ఆర్టీసీ అధికారులు బకాయి వసూలు పేరుతో నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఆర్టీసీతో లీజు ఒప్పందంలో వివాదాలను మధ్యవర్తిత్వంతో పరిష్కరించుకోవాలని ఉందన్నారు. లోక్‌సభ ఎన్నికల వేళ సీఎం ఆదేశాలను టీఎస్ ఆర్టీసీ ఎండీ సజ్జనార్ అమలు చేస్తూ మాల్‌ను సీజ్ చేయడానికి ఆర్టీసీ అధికారులను పంపించారన్నారు. ఒక రోజు ముందు ఆర్మూర్‌కు ఎన్నికల ప్రచారానికి వచ్చిన సీఎం రేవంత్‌రెడ్డి మాల్‌ను మూసి వేయిస్తానని హెచ్చరించారన్నారు. ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘిస్తూ జీవన్‌రెడ్డి మాల్‌పై బెదిరింపులకు పాల్పడిన ఆర్టీసీ సిబ్బందిని సస్పెండ్ చేయాలని కోరారు.

ఇంటర్ అడ్మిషన్లు ప్రారంభం

నిజామాబాద్ అర్బన్: ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం అడ్మిషన్ల ప్రక్రియ ప్రారంభమైందని జిల్లా ఇంటర్ విద్యాధికారి రవికుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 9న నోటిఫికేషన్ విడుదలైందని పేర్కొన్నారు. జిల్లాలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలల ప్రిన్సిపాల్‌లు అడ్మిషన్లను ప్రారంభించాలని ఆయన ఆదేశించారు. మొదటి విడత అడ్మిషన్లు మే 31 వరకు కొనసాగుతాయని పేర్కొన్నారు. విద్యార్థులు సర్టిఫికెట్లు తీసుకుని కళాశాలలకు వెళ్లాలని సూచించారు.

మరికొన్ని గంటలే..!

పార్లమెంట్ ఎన్నికలకు సమయం సమీపిస్తుండటంతో అభ్యర్థులు, ఆయా పార్టీల నేతల్లో హడావుడి పెరిగింది. మరికొన్ని గంటల్లో ప్రచారానికి తెరపడనుంది. దీంతో ప్రతి నిమిషాన్ని పూర్తిస్థాయిలో వినియోగించుకునేందుకు పార్టీ శ్రేణులను సర్వసన్నద్ధం చేశారు. కాగా ఇది వరకే ప్రధాన పార్టీల అగ్రనేతలు తమ అభ్యర్థుల తరపున ప్రచారం నిర్వహించి వెళ్లారు.

- సమయం సమీపిస్తున్నందున హడావుడి
- నేడు సాయంత్రం 6 గంటలకు ప్రచారం సమాప్తం
- ర్యాలీలతో హోరెత్తిస్తున్న ప్రధాన పార్టీలు
- ఇప్పటికే ముగిసిన అగ్రనేతల పర్యటనలు



సాక్షి ప్రతినిధి, నిజామాబాద్: పార్లమెంట్ ఎన్నికల పోలింగ్ ఇంకా ఒకే ఒక్క రోజు తేడాతో జరుగనుంది. అభ్యర్థుల ప్రచారానికి గడువు కేవలం కొద్ది గంటల్లో ముగియనుంది. శనివారం సాయంత్రం 6 గంటలకు ప్రచారం పరిసమాప్తం కానుంది. దీంతో మూడు ప్రధాన పార్టీలు ర్యాలీలతో హోరెత్తిస్తున్నాయి. ఇప్పటికే బీజేపీ, కాంగ్రెస్, బీఆర్‌ఎస్ పార్టీల అభ్యర్థులు తమ అగ్రనాయకులతో ప్రచారం చేయించారు. బీజేపీ అగ్రనేత, కేంద్ర హోంమంత్రి అమిత్‌షా ఎంపీ అర్వింద్ తరపున బహిరంగ సభలో పాల్గొనడంతో పాటు పసుపు బోర్డు ప్రధాన కార్యాలయాన్ని ఇందూరులోనే ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటించారు. నిజాం షుగర్స్‌ను సహకార విధానంలో రైతుల భాగస్వామ్యంతో ప్రారంభిస్తామన్నారు.

■ కాంగ్రెస్ అభ్యర్థి తాటిపర్తి జీవన్‌రెడ్డి తరపున ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పార్లమెంట్ పరిధిలోని నిజామాబాద్, ఆర్మూర్, కోరుట్లలో వరుసగా మూడుసార్లు పర్యటించారు. బహిరంగ సభలు, రోడ్‌షోలు, కార్నర్ మీటింగ్‌ల్లో పాల్గొని ప్రసంగించారు. సెప్టెంబర్ 17లోగా షుగర్ ఫ్యాక్టరీలను తెరిపిస్తామని స్పష్టం చేశారు. గల్ఫ్ సంక్షేమ బోర్డుపై హామీ ఇచ్చారు. జిల్లా అభివృద్ధి బాధ్యత తానే తీసుకుంటానని రేవంత్‌రెడ్డి హామీ ఇచ్చారు.

■ బీఆర్‌ఎస్ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్ తరపున ఆ పార్టీ అధినేత కేసీఆర్ బస్సుయాత్ర నిర్వహించారు. నిజామాబాద్‌లో కార్నర్ మీటింగ్‌లో పాల్గొన్నారు.

■ మూడు ప్రధాన పార్టీలు హోరాహోరీగా తలపడుతుండడంతో త్రిముఖ పోరు నెలకొంది. పార్లమెంట్ నియోజకవర్గం పరిధి ఎక్కువ విస్తీర్ణంలో ఉండగా, నామినేషన్లకు ముందునుంచే ఏడు సెగ్మెంట్లలో వివిధ సంఘాలు, కులాల వారీగా ఆత్మీయ సమ్మేళనాలు నిర్వహిస్తూ వచ్చిన అభ్యర్థులు చివరి దశలో హైరానా పడుతున్నారు.

ఓట్ల చీలికపై టెన్షన్..
బీజేపీ, కాంగ్రెస్, బీఆర్‌ఎస్ పార్టీల మధ్య త్రిముఖ పోరు నెలకొన్న నేపథ్యంలో ఏ పార్టీ ఓట్లు ఎటు చీలిపోతాయోననే విషయంలో ఒక స్పష్టత లేకుం డాపోయింది.దీంతో ఎవరి గెలుపోటములు ఏవిధంగా తారుమారవుతాయోననే దానిపై అంతుచిక్కని పరిస్థితి ఏర్పడింది. క్రాస్ ఓటింగ్ ఫలితాన్ని తారుమారు చేసే పరిస్థితి ఉండడంతో అభ్యర్థుల్లో టెన్షన్ నెలకొంది.

■ నిజామాబాద్ పార్లమెంట్ పరిధిలో జగిత్యాల, కోరుట్ల, బాల్కొండ శాసనసభ స్థానాలను గత అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ గెలుచుకోగా, నిజామాబాద్ అర్బన్, ఆర్మూర్ సీట్లను బీజేపీ, బోధన్, నిజామాబాద్ రూరల్ స్థానాలను కాంగ్రెస్ పార్టీ గెలుచుకుంది. ఓట్లు సైతం మూడు పార్టీలకు దాదాపు సమానంగానే వచ్చాయి. మూడు పార్టీలు బరిలో ఉన్న నేపథ్యంలో రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్, కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ నువ్వానేనా అనేలా బరిలో కొట్లాడుతున్నాయి. ఈ క్రమంలో బీఆర్‌ఎస్ పార్టీకి చెందిన ఓట్లు క్రాస్ అవుతాయనే అభిప్రాయాన్ని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు. కాగా ఓట్లు ఎటువైపు క్రాస్ అవుతాయనే విషయమై ఆయా అభ్యర్థుల్లో టెన్షన్ నెలకొంది. ప్రచార పర్వం ముగుస్తున్నందున అభ్యర్థులు పోల్ మేనేజ్‌మెంట్‌పై ప్రత్యేకంగా దృష్టిపెట్టారు. శాసనసభ సెగ్మెంట్ వారీగా లెక్కలు వేసుకుని పోల్ మేనేజ్‌మెంట్ పకడ్బందీగా చేసేందుకు రంగం సిద్ధం చేసుకుంటున్నారు. శాసనసభ ఎన్నికల్లో ప్రధాన పార్టీలకు వచ్చిన ఓట్లను పరిగణనలోకి తీసుకుంటూ, రాష్ట్రంలో ప్రభుత్వం మారిన సందర్భంలో మారిన సమీకరణాలను దృష్టిలో పెట్టుకుని సోషల్ ఇంజినీరింగ్‌ను ఎప్పటికప్పుడు నిర్వహించుకుంటున్నారు. సమయం లేకపోవడంతో పార్టీలు ప్రతి నిమిషాన్ని పూర్తిస్థాయిలో ఉపయోగించుకునేందుకు పార్టీ శ్రేణులను సర్వసన్నద్ధం చేశారు.

పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలి

- పోలింగ్ సజావుగా సాగాలి
- ఈవీఎంల తరలింపునకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలి
- కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్‌లో సీఈవో వికాస్‌రాజ్



వీసీలో పాల్గొన్న కలెక్టర్, అధికారులు

సుభాష్‌నగర్: పార్లమెంట్ ఎన్నికల పోలింగ్ ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్‌రాజ్ సూచించారు. 13న జరగనున్న పోలింగ్ కోసం చేపట్టాల్సిన ఏర్పాట్లపై రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్ రాజ్ శుక్రవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కలెక్టర్లకు సూచనలు చేశారు. పార్లమెంట్ ఎన్నికలను పకడ్బందీగా నిర్వహించాలని సూచించారు. పార్లమెంట్ నియోజకవర్గాల వారీగా పోస్టల్ బ్యాలెట్లను వేరుచేస్తూ, సంబంధిత సెగ్మెంట్లకు పంపించాలన్నారు. డిస్ట్రిబ్యూషన్ కేంద్రాల ద్వారా పోలింగ్ సామాగ్రి పంపిణీ చేసేందుకు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయాలని, ఎలాంటి తప్పిదాలకు తావులేకుండా చూడాలన్నారు. ఒకవేళ వర్షాలు కురిసినా ఈవీఎంలు, ఇతర పోలింగ్ సామాగ్రి తడిసిపోకుండా అవసరమైన జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. పోలింగ్‌కు మరికొద్ది గంటల వ్యవధి మాత్రమే మిగిలి ఉన్న నేపథ్యంలో నగదు, మద్యం, విలువైన వస్తువుల పంపిణీ వంటి వాటిపై గట్టి నిఘాపెట్టాలని, ఫిర్యాదులు అందిన వెంటనే స్పందించాలని సూచించారు. మాక్‌పోల్, పోలింగ్ ప్రక్రియ సందర్భంగా ఈవీఎంలలో సాంకేతిక సమస్యలు తలెత్తితే ఇంజినీర్లు అందుబాటులో ఉంటారని పేర్కొన్నారు. రీపోలింగ్‌కు ఆస్కారం లేకుండా నిబంధనలకు అనుగుణంగా పోలింగ్ ప్రక్రియ కొనసాగాలని సూచించారు. పోలింగ్ కేంద్రాల నుంచి కౌంటింగ్ కేంద్రం స్ట్రాంగ్‌రూంకు ఈవీఎంల తరలింపు కోసం అవసరమైన వాహనాలు సిద్ధం చేయాలని, పోలీసు బందోబస్తుతో తరలించాలన్నారు. అవాంఛనీయ ఘటనలు జరిగేందుకు ఆస్కారమున్న పోలింగ్ కేంద్రాలపై ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. పోలింగ్ కేంద్రాల్లో వెబ్ కాస్టింగ్ నిర్వహించాలని, కంట్రోల్ రూం ఏర్పాటు చేసి పోలింగ్ ప్రక్రియ నిరంతరం పర్యవేక్షించాలని పేర్కొన్నారు. కాన్ఫరెన్స్ అనంతరం కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు సంబంధిత అధికారులతో మాట్లాడుతూ ఈసీ మార్గదర్శకాల ప్రకారం పోలింగ్ నిర్వహణకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పార్లమెంట్ సెగ్మెంట్ పరిధిలోని ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో మహిళలు, యువత, దివ్యాంగులను పోలింగ్‌లో పాల్గొనేలా చూడాలన్నారు. సైలెన్స్ పీరియడ్‌లో పాటించాల్సిన నిబంధనలు పక్కాగా అమలయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. కాన్ఫరెన్స్‌లో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

నగరంలో కేంద్ర బలగాల కవాతు



ఖలీల్‌వాడి: నగరంలోని రెండో టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో శుక్రవారం కేంద్ర బలగాలు కవాతు నిర్వహించాయి. సీఐ నరహరి మాట్లాడుతూ ప్రజలు నిర్భయంగా ఓటు వేయాలన్నారు. సెంట్రల్ రిజర్వ్ ఫోర్స్ ఇన్‌స్పెక్టర్లు కుతుబుద్దీన్, యాదవ్, రెండో టౌన్ ఠాణా ఎస్సై రామ్ పాల్గొన్నారు.

మోదీ మానియా లేదు

- హిందుత్వం పేరుతో రెచ్చగొట్టడమే అర్వింద్ పని
- ఆరు గ్యారంటీలను మరిచిన కాంగ్రెస్
- ఎంపీగా గెలిపిస్తే అభివృద్ధి చేస్తా
- మీట్ ది ప్రెస్‌లో బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్



మీట్ ది ప్రెస్‌లో మాట్లాడుతున్న బాజిరెడ్డి

నిజామాబాద్‌నాగారం: మోదీ మానియా లేదు.. ఏమీ లేదని.. కొందరు బీజేపీ నాయకులే పుట్టిస్తున్నారని.. మోదీ జిల్లాకు చేసిన మేలు శూన్యమని బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్ పేర్కొన్నారు. ఎంపీ అర్వింద్ ఐదేళ్లుగా హిందుత్వం పేరుతో రెచ్చగొట్టడమే పనిగా పెట్టుకున్నారని విమర్శించారు. ఆరు గ్యారంటీల వాగ్దానాలతో గెలిచిన కాంగ్రెస్ పార్టీ.. అధికారంలోకి రాగానే మర్చిపోయిందని మండిపడ్డారు. ఎంపీగా గెలిపిస్తే జిల్లాను అభివృద్ధి చేస్తానని హామీ ఇచ్చారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో మీట్ ది ప్రెస్‌లో బాజిరెడ్డి మాట్లాడారు. అర్వింద్ ఒక్కరోజు కూడా జిల్లా సమస్యలను పార్లమెంట్‌లో ప్రస్తావించలేదన్నారు. గత ఎన్నికల్లో అర్వింద్ ఇచ్చిన పసుపు బోర్డు, గల్ఫ్ బోర్డ్, స్కిల్ డెవలప్‌మెంట్, షుగర్ ఫ్యాక్టరీలు తెరిపించడం వంటివేమీ ఆచరణకు నోచుకోలేదన్నారు. ధర్మపురి అర్వింద్ ఎంపీ నిధులను ఎవరికిచ్చారో తెలియని పరిస్థితి ఉందన్నారు. అభివృద్ధి చేయని అసమర్థుడని వ్యాఖ్యానించారు. మోదీ ప్రజలకు చేసింది శూన్యం.. బీఆర్‌ఎస్ ప్రభుత్వం రూ. మూడున్నర లక్షల కోట్ల అప్పు తెచ్చినా అభివృద్ధి చేసిందన్నారు. రూ. 50 లక్షల కోట్ల ఆస్తులు పెంచామన్నారు. ఎమ్మెల్సీ కవిత లోక్‌సభకు పోటీ చేస్తుందని భావించి లిక్కర్ స్కాంలో కావాలని ఇరికించి ఆమెను జైలుకు పంపించారని విమర్శించారు. రాజకీయంగా తాను తప్ప ఎవరూ పైకి రావద్దని భావించే వ్యక్తి కాంగ్రెస్ అభ్యర్థి జీవన్ రెడ్డి అని పేర్కొన్నారు. ఆయనతో ఒరిగేదేమీ లేదని, ఆయన మూడో స్థానానికి పరిమితమవుతారన్నారు. ఎంఐఎం నేత అసద్ బీజేపీ ఏజెంట్ అని ప్రియాంకా గాంధీ చెప్పారన్నారు. నిజామాబాద్‌లో ఎంఐఎం బీఆర్‌ఎస్‌కు సపోర్ట్ చేస్తుందని భావిస్తున్నామన్నారు. బీజేపీ, కాంగ్రెస్‌లు ఇద్దరిలో ఎవరైనా గెలవాలి కానీ బీఆర్‌ఎస్ గెలవద్దని ఆ పార్టీ నేతలు మ్యాచ్ ఫిక్సింగ్ చేసుకున్నాయని ఆరోపించారు. రెండు పార్టీలకు ప్రజలు ఎన్నికల్లో కర్రు కాల్చి వాత పెడతారన్నారు.

ఉద్యోగాల కల్పనపై ప్రత్యేక దృష్టి

- గల్ఫ్ వలసలు అరికట్టడమే లక్ష్యంగా ముందుకు..
- అర్హులందరికీ రేషన్‌కార్డులు ఇచ్చేలా ఒత్తిడి తెస్తాం
- బీజేపీ అభ్యర్థి, ఎంపీ అర్వింద్ ధర్మపురి
- 'విజన్ డాక్యుమెంట్' విడుదల



'విజన్ డాక్యుమెంట్'ను విడుదల చేస్తున్న ఎంపీ అర్వింద్, పక్కన ఎమ్మెల్యేలు రాకేశ్‌రెడ్డి, ధన్‌పాల్

సుభాష్‌నగర్: నిజామాబాద్ పార్లమెంట్ పరిధిలో రాబోయే ఐదేళ్లలో పసుపు, వరి, మొక్కజొన్న, మామిడి, చెరుకు ఆధారిత పరిశ్రమలు నెలకొల్పి ఎస్సీ, ఎస్టీ, బీసీ యువతీ యువకులకు పెద్దఎత్తున ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించడంపై ప్రత్యేక దృష్టి సారిస్తామని బీజేపీ అభ్యర్థి, ఎంపీ అర్వింద్ ధర్మపురి పేర్కొన్నారు. శుక్రవారం నగరంలోని బీజేపీ జిల్లా కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో.. రాబోయే ఐదేళ్లలో నియోజకవర్గంలో చేపట్టనున్న అంశాలపై 'విజన్ డాక్యుమెంట్'ను ఆయన విడుదల చేశారు. ఈసందర్భంగా అర్వింద్ మాట్లాడుతూ నిజామాబాద్ పార్లమెంట్ నియోజకవర్గంలో గడిచిన ఐదేళ్లలో కేంద్రీయ విద్యాలయాలు, జాతీయ రహదారుల నిర్మాణం, రైల్వేలైన్లు, ఆర్వోబీల నిర్మాణంతోపాటు చారిత్రాత్మక పసుపు బోర్డు ఏర్పాటు, పసుపు ధర పెరిగేలా కృషి చేశానని తెలిపారు. యువతకు ఉపాధి, గల్ఫ్ వలసలు అరికట్టడం, అర్హులకు రేషన్‌కార్డులు అందజేయడమే లక్ష్యంగా పని చేస్తానన్నారు. వీటితోపాటు రొటీన్‌గా చేపట్టే అభివృద్ధి పనులు కొనసాగుతాయన్నారు. బీడీ కార్మికుల సంక్షేమం కోసం 500 పడకల సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి నిర్మిస్తామని పేర్కొన్నారు. గల్ఫ్ కార్మికులు, ఎన్‌ఆర్‌ఐలు తమ ఇళ్లకు తిరిగి వచ్చిన వారికి ఉద్యోగావకాశాలు కల్పించేలా అధిక ప్రాధాన్యతనిస్తామని, గల్ఫ్ వలసలు అరికట్టడమే లక్ష్యంగా ముందుకు సాగుతామన్నారు.

రేషన్‌కార్డులు ఆపడం సిగ్గుచేటు
పార్లమెంట్ పరిధిలో చాలామంది అర్హులకు రేషన్ కార్డులు లేవని, పదేళ్లుగా బీఆర్‌ఎస్, వంద రోజులుగా కాంగ్రెస్ రేషన్ కార్డులు ఆపడం సిగ్గుచేటని అర్వింద్ ఆరోపించారు. ఎంపీగా గెలిచిన వెంటనే రాష్ట్ర ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి అర్హులైన ప్రతిఒక్కరికి రేషన్‌కార్డు అందేలా చూస్తానన్నారు. బీఆర్‌ఎస్ పాలనలో ప్రధానమంత్రి ఆవాస్ యోజన కింద ఒక్క ఇంటి ప్రవేశం జరగకపోవడం సిగ్గుచేటన్నారు. దేశవ్యాప్తంగా 4 కోట్ల ఇండ్ల ప్రవేశాలు జరిగాయని గుర్తుచేశారు. జక్రాన్‌పల్లి ఎయిర్‌పోర్టుతోపాటు, కొత్త రైల్వేలైన్లను ప్రారంభించడం ద్వారా దేశంలోని అన్ని ప్రాంతాలకు నియోజకవర్గానికి కనెక్టివిటీ పెరుగుతుందన్నారు. సీఎస్‌ఆర్ నిధులతో భారీస్థాయిలో స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ ఏర్పాటు చేస్తామన్నారు. అనంతరం వివిధ పార్టీల నాయకులు బీజేపీలో చేరారు. సమావేశంలో అర్బన్, ఆర్మూర్ ఎమ్మెల్యేలు ధన్‌పాల్ సూర్యనారాయణ, పైడి రాకేశ్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు దినేష్ కులాచారి, నాయకులు, కార్పొరేటర్లు న్యాలం రాజు, నాగోళ్ల లక్ష్మీనారాయణ, గద్దె భూమన్న, శంకర్, స్రవంతిరెడ్డి, పంచరెడ్డి ప్రవళిక, ఎర్రం సుధీర్ పాల్గొన్నారు.

ఓటరు కదిలేనా..!

- ఎండ తీవ్రత కారణంగా ఓటేసేందుకు ముందుకు వచ్చేనా..
- పోలింగ్ శాతం పెంచేందుకు అధికారుల విస్తృత ప్రచారం

నిజామాబాద్‌అర్బన్: లోక్‌సభ ఎన్నికల్లో ఈ సారి ఓటింగ్ పెంచేందుకు జిల్లా అధికార యంత్రాంగం శ్రమిస్తోంది. ఇందుకోసం ఇప్పటికే జిల్లాలో విస్తృత ప్రచారం నిర్వహించారు. గతంలో కంటే ఈ సారి ఓటింగ్ శాతం పెంచేందుకు చర్యలు తీసుకుంటున్నారు. ప్రచార రథాలతో పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో ఓటు హక్కుపై అవగాహన కల్పించారు. బీఎల్‌వోల ద్వారా ఇంటింటికి తిరుగుతూ ఓటరు నమోదు కార్యక్రమంతో పాటు ప్రజలకు ఓటు ప్రాధాన్యతను వివరించారు. బూత్‌ల వారీగా ఓటింగ్ శాతం పెంచేందుకు కలెక్టర్ ఇదివరకే సమీక్ష సమావేశాలు కూడా నిర్వహించారు. అధికారుల కృషి ఫలించి జిల్లాలో ఈ సారైన ఓటింగ్ శాతం పెరుగుతుందా చూడాల్సిందే.

గత ఎన్నికల్లో అర్బన్‌లో పోలింగ్ 56 శాతమే..
2019 లోక్‌సభ ఎన్నికల్లో అతి తక్కువగా నిజామాబాద్ అర్బన్ నియోజక వర్గంలో 56.25 శాతం మాత్రమే పోలింగ్ జరిగింది. తర్వాత కోరుట్లలో 69.09 పోలింగ్ శాతం నమోదైంది. జగిత్యాల నియోజకవర్గంలో 70.24 శాతం, ఆర్మూర్ నియోజక వర్గంలో 70.47 శాతం ప్రజలు ఓటు హక్కు వినియోగించుకున్నారు. పార్లమెంట్ పరిధిలో నిజామాబాద్ అర్బన్ నియోజక వర్గంలో అత్యధికంగా ఓటర్లు ఉన్నారు. మొత్తం 2,68,429 మంది ఓటర్లు ఉండగా.. కేవలం 1,51,002 మంది మాత్రమే ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఓటు హక్కు వినియోగించుకునేందుకు నగరవాసులు ఆసక్తి చూపలేదు. గ్రామీణ ప్రాంతాల్లోని ఓటర్లే ఎక్కువ ముందుకు వచ్చారు. ప్రస్తుతం ఎండతీవ్రత ప్రభావంతో ఓటర్లు ఆసక్తి చూపుతారా అనే సందిగ్ధం నెలకొంది. మరోవైపు 85 ఏళ్లపైబడి వృద్ధులు ఇంటి నుంచి ఓటు వేసేందుకు ప్రభుత్వం అవకాశం కల్పించడంతో వారికి ఉపశమనం కలిగింది.

సమస్యాత్మక ప్రాంతాలపై దృష్టి
జిల్లాలోని సమస్యాత్మక ప్రాంతాలపై అధికారులు దృష్టి సారించారు. ఇక్కడ పోలింగ్ శాతం పెంచేందుకు కృషి చేస్తున్నారు. జిల్లాలో అత్యధికంగా బోధన్ నియోజకవర్గంలో 38 సమస్యాత్మక ప్రాంతాలను గుర్తించారు. వీటిలో 81 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి. బాల్కొండలో 31 ఉండగా.. 100 పోలింగ్ కేంద్రాలు, ఆర్మూర్‌లో 28 ఉండగా.. 81 పోలింగ్ సెంటర్లు, నిజామాబాద్ అర్బన్‌లో 23 ఉండగా.. 97 పోలింగ్ కేంద్రాలు, నిజామాబాద్ రూరల్‌లో 22 సమస్యాత్మక ప్రాంతాలుండగా.. 58 పోలింగ్ సెంటర్లు ఉన్నాయి. వీటిపై ఈసారి పోలీసులు ప్రత్యేక దృష్టి సారించారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకున్నారు. సమస్యాత్మక ప్రాంతాల్లో ప్రస్తుతం పోలింగ్ శాతం పెంచేందుకు అవగాహన కార్యక్రమాలు చేపట్టారు.

2019లో లోక్‌సభ ఎన్నికల్లో నమోదైన ఓటింగ్ వివరాలు

నియోజకవర్గం	మొత్తం ఓటర్లు	ఓటేసిన వారు	శాతం	ప్రస్తుత ఓటర్లు
ఆర్మూర్	1,91,414	1,34,894	70.44	2,12,145
బోధన్	2,06,644	1,48,667	71.09	2,23,096
నిజామాబాద్‌అర్బన్	2,68,429	1,51,002	56.24	3,04,317
నిజామాబాద్ రూరల్	2,35,951	1,69,206	71.67	2,56,593
బాల్కొండ	2,05,653	1,48,085	71.99	2,26,792
కోరుట్ల	2,28,368	1,57,779	69.09	2,45,249
జగిత్యాల	2,16,379	1,51,989	70.24	2,36,675

గోప్యమెందుకో..!

- పంటనష్ట పరిహారం వివరాలను వెల్లడించని వ్యవసాయశాఖ
- నిధులు విడుదలైనా పట్టనట్లుగా డీఏవో వ్యవహారం
- బాధిత రైతులకు కరువైన స్పష్టత



జిల్లా వ్యవసాయ శాఖ కార్యాలయం

డొంకేశ్వర్(ఆర్మూర్): ప్రకృతి వైపరీత్యాలకు దెబ్బతిన్న పంటలకు రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల జిల్లాకు సంబంధించి పరిహారం నిధులను విడుదల చేసింది. కానీ, జిల్లాలో ఎంతమంది రైతులకు ఎన్ని ఎకరాలకు నిధులు వచ్చాయో తెలియని పరిస్థితి నెలకొంది. వివరాలను వెల్లడించకుండా వ్యవసాయ శాఖ గోప్యతను పాటిస్తోంది. జిల్లా వ్యవసాయాధికారి కూడా ఈ విషయంలో పట్టనట్లుగా వ్యవహరించడంతో రైతుల నుంచి విమర్శలు వస్తున్నాయి. పరిహారం గురించి అడిగితే మాటను దాటవేసే ప్రయత్నం చేయడం అనుమానాలకు తావిస్తోంది. తద్వారా పంటలు నష్టపోయిన రైతులకు పరిహారం వచ్చిందో లేదో స్పష్టత రావడం లేదు. దీంతో రైతులు ఆందోళనకు గురవుతున్నారు. గత రెండు నెలల్లో వడగళ్లు, అకాల వర్షాలకు ఇటీవల జిల్లాలో వందల ఎకరాల్లో వరి, మామిడి, నువ్వు, ఇతర పంటలు దెబ్బతిన్నాయి. వడగళ్ల ప్రభావానికి అత్యధికంగా వరికి నష్టం వాటిల్లింది. మార్చి 16న కురిసిన వడగళ్లకు 6,058 ఎకరాలు, ఏప్రిల్ 8న కురిసిన వర్షానికి 1,726 ఎకరాలు, అలాగే ఏప్రిల్ 19న కురిసిన వడగళ్లకు 907 ఎకరాల్లో పంటలకు నష్టం జరిగింది. అయితే, పంటనష్టం వివరాలను రైతు వారీగా సేకరించిన వ్యవసాయ శాఖ కలెక్టర్ అనుమతితో అంచనా నివేదికను విడతల వారీగా ప్రభుత్వానికి పంపింది. అంచనాల్లో అసలు నష్టాన్ని తీసి ఎన్యుమరేషన్ చేశారు. రైతు వారీగా వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేశారు. వారం క్రితం రాష్ట్ర ప్రభుత్వం ఎకరానికి రూ. 10వేల చొప్పున పరిహారం నిధులను జిల్లాకు విడుదల చేసింది. కానీ, ఎంతమంది రైతులకు ఎన్ని ఎకరాలకు పరిహారం వచ్చిందో వ్యవసాయ శాఖ దగ్గర లెక్కలు లేకపోవడం విడ్డూరమనే చెప్పాలి. ప్రభుత్వమే పంటనష్ట పరిహారంపై బహిరంగ ప్రకటన చేసినా జిల్లా వ్యవసాయాధికారి వివరాలను బహిర్గతం చేయకపోవడం రాష్ట్ర ప్రభుత్వానికి చెడ్డపేరును తీసుకువచ్చేలా ఉందని పలువురు పేర్కొంటున్నారు.

క్లుప్తంగా

జెడ్పీ సమావేశం వాయిదా



నిజామాబాద్ రూరల్: జిల్లా పరిషత్(జెడ్పీ) సర్వసభ్య సమావేశం వాయిదా పడింది. శుక్రవారం ఉదయం 10:30 గంటల వరకు కూడా జెడ్పీటీసీలు రాకపోవడం.. సంబంధిత అధికారులు మాత్రమే ఉండటంతో సమావేశాన్ని 12 గంటలకు వాయిదా వేస్తున్నట్లు జెడ్పీ చైర్మన్ దాదాన్నగారి విఠల్ రావు తెలిపారు. చివరకు సమావేశ మందిరంలో కోరం లేకపోవడంతో సమావేశాన్ని వాయిదా వేస్తున్నట్లు సీఈవో ఉష తెలిపారు. మళ్లీ సమావేశం ఎప్పుడు నిర్వహిస్తామో త్వరలో తెలియజేస్తామని, తేదీని ముందుగానే ప్రకటిస్తామని ఆమె తెలిపారు.

శిక్షణ శిబిరం పరిశీలన



సిరికొండ: జిల్లా స్పోర్ట్స్ అథారిటీ ఆధ్వర్యంలో సత్యశోధక్ పాఠశాలలో నిర్వహిస్తున్న బేస్ బాల్ శిక్షణ శిబిరాన్ని శుక్రవారం జిల్లా సాఫ్ట్ బాల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి మర్కంటి గంగామోహన్, జిల్లా కోచ్ అనికేత్‌తో కలిసి సందర్శించారు. విద్యార్థులు క్రీడా స్ఫూర్తితో నైపుణ్యాలను మెరుగుపర్చుకొని అంతర్జాతీయ స్థాయికి ఎంపిక కావాలని ఆయన సూచించారు. ప్రిన్సిపాల్ నర్సయ్య, పీఈటీలు అనిల్, సంతోష్, విద్యార్థులు పాల్గొన్నారు.

వాలీబాల్ నెట్ల పంపిణీ



జక్రాన్‌పల్లి: మండలంలోని మాదాపూర్‌లో జిల్లా క్రీడా యువజన, క్రీడా శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వాలీబాల్ వేసవి శిక్షణ శిబిరాన్ని జిల్లా క్రీడా అధికారి ముత్తెన్న శుక్రవారం పరిశీలించారు. క్రీడాకారులకు వాలీబాల్ నెట్లను ఆయన అందజేశారు. కోచ్ వెంకటేష్‌గౌడ్, పీఈటీ యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ బూత్‌ల పరిశీలన



డిచ్‌పల్లి: మండలంలోని ధర్మారం(బి) గ్రామంలో పోలింగ్ బూత్‌లను శుక్రవారం అడిషనల్ కలెక్టర్ కిరణ్‌కుమార్ పరిశీలించారు. పోలింగ్ రోజు ఓటర్లకు అన్ని రకాల వసతులు కల్పించాలని సిబ్బందికి సూచించారు. వైద్య, ఆరోగ్య సిబ్బంది అందుబాటులో ఉండేలా చూడాలన్నారు. పోలింగ్ సిబ్బందికి భోజనం, వసతి సౌకర్యం కల్పించాలని స్థానిక అధికారులకు సూచించారు. ఏఆర్ఐ భూపతి ప్రభు, పంచాయతీ కార్యదర్శి రాజలింగం, బీఎల్‌వోలు ఉన్నారు.

ఆర్టీసీ బస్టాండ్‌లో తనిఖీలు

ఖలీల్‌వాడి: నిజామాబాద్ ఆర్టీసీ బస్టాండ్‌లో ఒకటో టౌన్ పోలీసులు శుక్రవారం రాత్రి తనిఖీలు నిర్వహించారు. లోకసభ ఎన్నికలు ఈ నెల 13న ఉండటంతో ఎస్సై విష్ణు, ప్రకాష్‌లు బస్టాండ్‌లోని అన్ని ప్లాట్‌ఫారమ్‌ల వద్ద తనిఖీలు చేపట్టారు. బ్యాగులను పరిశీలించి ప్రయాణికుల వివరాలు తెలుసుకున్నారు.

న్యాయవాది నుంచి రాజకీయాల్లోకి..

- మల్యాల సమితి సభ్యుడిగా జీవన్‌రెడ్డి రాజకీయ ప్రస్థానం ప్రారంభం
- వైఎస్సార్ హయాంలో మంత్రిగా బాధ్యతలు



ఖలీల్‌వాడి: న్యాయవాద వృత్తి నుంచి రాజకీయాల్లోకి వచ్చి అంచెలంచెలుగా ఎదిగారు తాటిపర్తి జీవన్‌రెడ్డి. 1981లో మల్యాల సమితి సభ్యుడిగా జీవన్‌రెడ్డి రాజకీయ ప్రస్థానం మొదలైంది. జగిత్యాల కోర్టులో న్యాయవాది పని చేస్తున్న సమయంలో ఆయనను నిజామాబాద్‌కు చెందిన రాజకీయ నేత ఏలేటి మహిపాల్‌రెడ్డి టీడీపీలోకి తీసుకువచ్చారు. 1983లో జగిత్యాల టీడీపీ అభ్యర్థిగా పోటీచేసి గెలిచి జీవన్‌రెడ్డి శాసనసభలో తొలిసారి అడుగుపెట్టారు.

- 1985లో జరిగిన ఎన్నికలలో జీవన్‌రెడ్డి కాంగ్రెస్ పార్టీ నుంచి పోటీ చేశారు. ఆ ఎన్నికలలో టీడీపీ అభ్యర్థి రాజేశ్వర్‌గౌడ్ చేతిలో ఓటమి పాలయ్యారు.
- 1989లో కాంగ్రెస్ నుంచి పోటీ చేసి జీవన్‌రెడ్డి మరోసారి గెలుపొందారు.
- 1994లో టీడీపీ చేతిలో జీవన్‌రెడ్డి ఓటమి పాలయ్యారు. 1994 నుంచి 96 వరకు ఎల్.రమణ ఎమ్మెల్యేగా కొనసాగారు. తర్వాత వచ్చిన ఎంపీ ఎన్నికలలో టీడీపీ ఎల్ రమణను కరీంనగర్ బరిలో నిలిపింది. ఎల్ రమణ గెలుపొందడంతో జగిత్యాల నియోజకవర్గానికి ఉప ఎన్నిక జరిగింది. ఈ ఉప ఎన్నికలలో కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసిన జీవన్‌రెడ్డి గెలుపొందారు.
- 1999, 2004 ఎన్నికల్లో ఆయన విజయం సాధించారు. వైఎస్సార్ హయాంలో రోడ్లు, భవనాల శాఖ మంత్రిగా పని చేశారు. 2006, 2008లో ఎంపీ ఉప ఎన్నికలలో మాజీ సీఎం కేసీఆర్‌పై పోటీ చేసి ఓడిపోయారు.
- 2009లో శాసనసభ ఎన్నికలలో టీడీపీ అభ్యర్థి రమణ చేతిలో ఓడిపోయారు.
- 2014లో జీవన్‌రెడ్డి, టీడీపీ అభ్యర్థి రమణపై గెలుపొందారు.
- 2018 ఎన్నికలో టీఆర్ఎస్ అభ్యర్థి డాక్టర్ సంజయ్ ఓడిపోయారు. అనంతరం కరీంనగర్ పట్టభద్రుల ఎన్నికలలో జీవన్‌రెడ్డి ఎమ్మెల్సీగా ఎన్నికయ్యారు.
- 2023లో కాంగ్రెస్ అభ్యర్థి జీవన్‌రెడ్డిపై, బీఆర్ఎస్ అభ్యర్థి సంజయ్ గెలుపొందారు. దీంతో పార్లమెంట్ ఎన్నికలలో ఆయనను నిజామాబాద్ నుంచి పార్టీలో బరిలో నిలిపింది.

పోలింగ్ శాతం పెంచడమే లక్ష్యంగా..

- ఇంటింటికీ ఓటరు స్లిప్పుల పంపిణీ
- బీఎల్‌వోలకు బాధ్యతలను అప్పగించిన ఎన్నికల కమిషన్



ఓటరు స్లిప్పులను పంపిణీ చేస్తున్న బీఎల్‌వో

మోర్తాడ్(బాల్కొండ): లోక్‌సభ ఎన్నికల్లో పోలింగ్ శాతం పెంచేలా ఎన్నికల కమిషన్, బూత్ లెవల్ అధికారు(బీఎల్‌వో)లకు దిశా నిర్దేశం చేసింది. గతంలో మాదిరిగా 70 నుంచి 75 శాతానికి పరిమితం కాకుండా కనీసం 90 శాతం పోలింగ్ నమోదయ్యేలా కృషి చేయాలని బీఎల్‌వోలకు నిర్దేశించారు. ఇంటింటికి పోలింగ్ స్లిప్పులను పంపిణీ చేయించడంతో పాటు ఓటర్లను చైతన్యవంతులను చేయడానికి విస్తృతమైన ప్రచారం నిర్వహిస్తుంది. నిజామాబాద్ పార్లమెంట్ స్థానం పరిధిలో 1,808 పోలింగ్ బూత్‌లు ఉండగా మహిళలు, పురుషులు, ఇతరులు కలిపి 17,04,867 మంది ఓటర్లు ఉన్నారు. ఎవరైనా పొరుగు రాష్ట్రాలకు, విదేశాలకు వెళ్లిన వారు ఉంటే వారిని వదలిపెట్టి ఇంటి వద్ద ఉండే ప్రతి ఒక్కరు ఓటు వేసేలా బీవోఎల్‌లు బాధ్యత వహించాల్సి ఉంది. ఓటర్ల స్లిప్పుల పంపిణీని ఎన్నికల కమిషన్ ప్రతిష్టాత్మకంగా తీసుకుంది. ప్రతి ఓటరుకు స్లిప్పును అందించే ఏర్పాట్లు చేసింది.

ఓటర్ల నంబర్లకు మెసేజ్‌లు..

పోలింగ్ శాతం పెంచడానికి ఎన్నికల కమిషన్ విస్తృతమైన చర్యలు తీసుకుంది. ఓటర్ల మొబైల్ నంబర్లకు ఎన్నికల కమిషన్ పేరు మీద ఓటు హక్కును ప్రతి ఒక్కరు వినియోగించుకోవాలని ఎస్ఎంఎస్‌లు చేస్తున్నారు. ఎన్నికల కమిషన్ ప్రత్యేకంగా ముద్రించిన ఓటు హక్కును వినియోగించుకో అనే పోస్టర్లను సామాజిక మాధ్యమాలలో పోస్ట్ చేస్తున్నారు.

మెస్సేజ్‌లతో హోరెత్తిన ప్రచారం

- ఓటర్ల మొబైల్ ఫోన్‌లకు ఎంపీ అభ్యర్థుల వాయిస్‌లతో కాల్స్
- తమ పార్టీ చేసిన పనులతో పాటు తాము చేపట్టబోయే వాటిపై హామీలు

మోర్తాడ్(బాల్కొండ): లోక్‌సభ ఎన్నికల పోలింగ్‌కు సమయం దగ్గర పడటంతో ఎంపీలుగా పోటీ చేస్తున్న అభ్యర్థుల వాయిస్ కాల్స్‌తో ఓటర్ల ఫోన్లు హోరెత్తుతున్నాయి. అధినాయకుల సభలు, సమావేశాలు, కార్నర్ సమావేశాలు, ఇంటింటి ప్రచారంతో పాటు వాయిస్ కాల్స్‌తో ఎంపీ అభ్యర్థులు ప్రచారంలో దూసుకుపోతున్నారు. నిజామాబాద్ పార్లమెంట్ స్థానం నుంచి బీజేపీ, కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీల తరపున పోటీ చేస్తున్న సిట్టింగ్ ఎంపీ అర్వింద్, ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి, ఆర్టీసీ మాజీ చైర్మన్ బాజిరెడ్డి గోవర్ధన్‌లు తమ వాయిస్ రికార్డులతో ఓటర్ల మొబైల్ ఫోన్‌లకు ఆటోమేటిక్‌గా కాల్స్ వచ్చేలా ఏర్పాట్లు చేసుకున్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు అనేక మంది ఓటర్ల మొబైల్స్‌కు కాల్స్ వస్తున్నాయి. కొత్త నంబర్ల నుంచి కాల్స్ వస్తుండటంతో ఇదేమిటో అని ఓటర్లు ఫోన్ ఎత్తితే చాలు అవతలి వైపు నుంచి ఎంపీ అభ్యర్థుల పరిచయం, తమ పార్టీ ఇచ్చిన హామీలు, తాము చేపట్టబోయే పనుల గురించి చెబుతూనే ఉన్నారు. ముగ్గురు అభ్యర్థులు పోటా పోటీగా ఓటర్ల మొబైల్స్‌కు ఆటోమేటిక్‌గా కాల్స్ వచ్చేలా ఏర్పాట్లు చేసుకున్నారు. ఏది ఏమైనా సాంకేతికతను ఎంపీ అభ్యర్థులు విచ్చలవిడిగా వినియోగించుకుంటున్నారని చెప్పొచ్చు.

స్పెషల్ జుడీషియల్ జడ్జిని కలిసిన లీగల్ సర్వీస్ డిఫెన్స్ సభ్యులు



ఖలీల్ వాడి: నిజామాబాద్ స్పెషల్ జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ ఫర్ మొబైల్ జడ్జి చైతన్య అంగారిని నిజామాబాద్ లీగల్ సర్వీసెస్ డిఫెన్స్ సభ్యులు శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. చీఫ్ డిఫెన్స్ కౌన్సిల్ రాజ్‌కుమార్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు జగన్మోహన్ గౌడ్, డిఫెన్స్ కౌన్సిల్ సభ్యులు ఉదయ్ కృష్ణ, ప్రమోద్ గంగోనే, పిల్లి శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

రైతులకు ఒక్క రూపాయీ మాఫీ చేయలేదు

- దేశవ్యాప్తంగా మోదీపై అపనమ్మకం
- కర్నాటక మంత్రి బోసు రాజు



మాట్లాడుతున్న మంత్రి బోసు రాజు పక్కన భూపతి రెడ్డి, సుదర్శన్ రెడ్డి, మహేశ్ కుమార్ గౌడ్, మండవ

సుభాష్‌నగర్: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం పదేళ్లలో రైతాంగానికి ఒక్క రూపాయి మాఫీ చేయలేదని, కేవలం కార్పొరేట్లు ఆదానీ, అంబానీలకు మాత్రమే మాఫీ చేసిందని కర్నాటక ఇరిగేషన్ మంత్రి బోసు రాజు విమర్శించారు. శుక్రవారం నగర శివారులోని ఓ హోటల్‌లో ఎమ్మెల్యేలు సుదర్శన్ రెడ్డి, భూపతిరెడ్డి, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్, మాజీ మంత్రి మండవ వెంకటేశ్వర్‌రావుతో కలిసి ఆయన మాట్లాడారు. గ్యారెంటీ అనే పదం కర్నాటక అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ తీసుకొచ్చిందని గుర్తుచేశారు. అసెంబ్లీ ఎన్నికల సమయంలో 36 సార్లు కర్నాటక వచ్చిన మోదీ గ్యారెంటీలు సాధ్యం కావని ప్రచారం చేశారని, ఇప్పుడు ప్రధాని మోదీ మధ్యప్రదేశ్, రాజస్థాన్‌లలో గ్యారంటీలను ఇస్తున్నారని ఎద్దేవా చేశారు. కర్నాటకలో 20 స్థానాల్లో గెలవబోతుందని కేంద్రంలో అధికారంలోకి రావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు.

కేసీఆర్ ఆత్మ విమర్శ చేసుకోవాలి: మండవ

రైతు బంధు ఐదెకరాల వరకే జమ చేశారని, మిగతా రైతులకు ఎగనామం పెడుతున్నారని మాజీ సీఎం కేసీఆర్, కేటీఆర్, హరీష్‌రావు దుష్ప్రచారం చేస్తున్నారని, ఈ విషయంలో ఆత్మ విమర్శ చేసుకోవాలని మాజీ మంత్రి మండవ వెంకటేశ్వర్‌రావు హితవు పలికారు. 6వ తేదీలోపే జమ చేశారని, కానీ ఎన్నికల కమిషన్ నిలిపేయాలని ఆదేశాలిచ్చిందని గుర్తుచేశారు. తెలంగాణ ప్రజల ఆకాంక్షలకు భిన్నంగా పాలన చేస్తూ కేసీఆర్ అభాసుపాలయ్యారని, ఉద్యమ గౌరవాన్ని నిలుపుకోలేదని విమర్శించారు. ఆగస్టు 15లోపు ఏకకాలంలో రూ.2 లక్షల రుణమాఫీ చేస్తామని రేవంత్‌రెడ్డి ఘంటాపథంగా చెప్తూ.. బీఆర్ఎస్ సవాళ్లను స్వీకరిస్తున్నారని గుర్తుచేశారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే రైతు రుణాలు మాఫీ చేస్తుందని, పంటల మద్దతు ధరలకు చట్టబద్ధత కల్పిస్తుందన్నారు. ఉగ్రవాద సంస్థల మద్దతుపై విలేకర్లు ప్రశ్నించగా, తమకేం సంబంధం లేదని, వారి మద్దతు అవసరం లేదని సమాధానమిచ్చారు. డీసీసీ అధ్యక్షుడు మానాల మోహన్‌రెడ్డి, ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హందాన్, నాయకులు అగర్వాల్, బాగారెడ్డి, పారిపెల్లి గంగారెడ్డి, జావిద్ అక్రమ్, అంతిరెడ్డి దేవేందర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

వీడిన మిస్సింగ్ మిస్టరీ

- 2022 సెప్టెంబర్‌లో మహిళ అదృశ్యం
- ఏడాదిన్నర తర్వాత కేసు ఛేదన
- ప్రియుడి చేతిలో దారుణ హత్యకు గురైనట్లు గుర్తింపు
- పోలీసుల అదుపులో నిందితుడు
- వివరాలు వెల్లడించిన ట్రెయినీ ఐపీఎస్ కాజల్ సింగ్



వివరాలు వెల్లడిస్తున్న ట్రెయినీ ఐపీఎస్ అధికారిణి

కామారెడ్డి క్రైం: యేడాదిన్నరగా పెండింగ్‌లో ఉన్న ఓ మహిళ మిస్సింగ్ కేసును భిక్కనూర్ పోలీసులు ఎట్టకేలకు ఛేదించారు. ఈ కేసులో పోలీసులను తప్పుదోవ పట్టించి ఇంతకాలం తప్పించుకు తిరిగిన ఆమె ప్రియుడే హంతకుడని తేలింది. దీంతో నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. శుక్రవారం కామారెడ్డి డీఎస్పీ కార్యాలయంలో ట్రెయినీ ఐపీఎస్ కాజల్ సింగ్ వివరాలు వెల్లడించారు. భిక్కనూర్ మండలం లక్ష్మీనగర్ తండాకు చెందిన సంధ్య(28)కు భర్త ఇద్దరు పిల్లలు ఉన్నారు. కూలి పని చేసుకునే ఆమె ఇంటి నుంచి పనికి వెళ్లి తిరిగి రాకపోవడంతో భర్త పోలీసులకు ఫిర్యాదు చేశారు. 2022 సెప్టెంబర్ 16న మహిళ అదృశ్యమైనట్లు భిక్కనూర్ పీఎస్‌లో కేసు నమోదైంది. అప్పటి నుంచి కేసు పెండింగ్‌లోనే ఉంది.

మద్యం తాగించి..

దోమకొండ మండలం చింతమాన్‌పల్లికి చెందిన మహేష్ ట్రాక్టర్ డ్రైవర్‌గా పని చేసేవాడు. అదృశ్యమైన మహిళ సంధ్య కూలి పనులకు వెళ్లే చోట నాలుగేళ్ల క్రితం పరిచయమయ్యాడు. వారి పరిచయం వివాహేతర సంబంధానికి దారి తీసింది. తన సంసారానికి ఇబ్బందులు రావద్దనే ఉద్దేశంతో మహేష్‌కు దూరంగా ఉండటం మొదలు పెట్టింది సంధ్య. దీంతో వారి మధ్య విభేదాలు వచ్చాయి. ఆమెను ఎలాగైనా హత్య చేయాలని నిర్ణయించుకున్న మహేష్ 2022 సెప్టెంబర్ 14న మాయ మాటలు చెప్పి క్యాసంపల్లి శివారులోని ఓ నిర్మానుష్య ప్రాంతానికి తీసుకువెళ్లాడు. ఆమెతో మద్యం తాగించి మత్తులోకి వెళ్లేలా చేశాడు. బండ రాయితో తల, ఛాతీపై మోది దారుణంగా హత్య చేశాడు. ఆమె వద్దనున్న రూ.50 వేలు నగదు, బంగారు ఆభరణాలను దోచుకుని సెల్‌ఫోన్‌ను మరో చోట దూరంగా పడేసి పరారయ్యాడు.

పోలీసులను తప్పుదోవ పట్టించి..

మిస్సింగ్ కేసు నమోదు చేసిన పోలీసులు ఆమెతో కలిసి కూలి పని చేసేవారిని, పరిచయస్తులను, బంధువులను అందరినీ విచారించినా ఎలాంటి క్లూ దొరకలేదు. ఆమెతో సన్నిహితంగా ఉండేవాడని తెలియడంతో అప్పట్లో మహేష్‌ను కూడా విచారించారు. తనకేం తెలియనట్లు నటించి పోలీసులను పక్కదారి పట్టించడమే కాకుండా విదేశాలకు పారిపోయాడు. ఆరు నెలల క్రితం తిరిగి వచ్చి తప్పించుకు తిరుగుతున్న ఆయనపై పోలీసులకు అనుమానం బలపడింది. సాంకేతిక పరిజ్ఞానం ఆధారంగా మహేష్ ఆచూకీని గుర్తించి అదుపులోకి తీసుకుని విచారించగా నేరం అంగీకరించినట్లు ట్రెయినీ ఐపీఎస్ తెలిపారు. హత్య జరిగిన స్థలాన్ని పరిశీలించి మృతురాలి ఆనవాళ్లు గుర్తించామని వెల్లడించారు. కేసు ఛేదనలో విశేషంగా కృషి చేసిన భిక్కనూర్ సీఐ సంపత్ కుమార్, ఎస్సై సాయికుమార్, సిబ్బంది, సహకరించిన సదాశివనగర్, సీసీఎస్ సీఐలు సంతోష్ కుమార్, శ్రీనివాస్, ఎస్సై రాజులను అభినందించారు. డీఎస్పీ నాగేశ్వర్ రావు, రూరల్ సీఐ రామన్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వం కూలడం ఖాయం

- నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ



కూరగాయలు విక్రయిస్తూ ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ

సుభాష్‌నగర్: జూన్ 6 తర్వాత రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం కూలడం ఖాయమని నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ పేర్కొన్నారు. బీజేపీ మహాజన్ సంపర్క్ అభియాన్‌లో భాగంగా శుక్రవారం ఆయన 41వ డివిజన్‌లో పార్లమెంట్ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా పదేళ్లలో బీజేపీ చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలు, రానున్న రోజుల్లో చేపట్టనున్న కార్యక్రమాలపై ఇంటింటికీ తిరిగి కరపత్రాలు పంపిణీ చేసి, వివరించారు. అనంతరం ధన్‌పాల్ మాట్లాడుతూ.. అర్బన్ నియోజకవర్గంలో ఏ ఇంటికి వెళ్లినా ప్రజల నుంచి విశేష స్పందన వస్తుందని, అందరూ మోదీ, రామ జపం చేస్తున్నారని తెలిపారు. కాంగ్రెస్ ఎన్ని కుట్రలు చేసినా.. ప్రజలు ఆ పార్టీని విశ్వసించడం లేదని, రాష్ట్రంలో ప్రభుత్వం ఏర్పడిన 4 నెలల్లోనే నమ్మకాన్ని పోగొట్టుకుందని ఆరోపించారు. అర్బన్‌లో లక్ష ఓట్లు బహుమతిగా ఇచ్చి అరివ్రింద్ గెలుపును నరేంద్ర మోదీకి అంకితం చేస్తామన్నారు. నాయకులు శ్రీనివాస్, సత్యనారాయణ, ఈశ్వర్‌రావు, శంకర్, లక్ష్మణ్, రాహుల్, పృథ్వీ, నాని పాల్గొన్నారు.

గాలివాన బీభత్సం



ఎస్‌జీ తండాలో పడిపోయిన విద్యుత్ స్తంభం

ధర్పల్లి/నిజామాబాద్ రూరల్: ధర్పల్లి, నిజామాబాద్ రూరల్ మండలంలో శుక్రవారం మధ్యాహ్నం బలమైన గాలులు వీచడంతోపాటు వర్షం కురిసింది. దీంతో పలు గ్రామాల్లో విద్యుత్ స్తంభాలు, చెట్లు విరిగి పడ్డాయి. పలుచోట్ల విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. నల్లబండ తండాలో ఓ ఇంటి పైకప్పు ఎగిరిపోయింది.

క్రైం కార్నర్

వైద్యం వికటించి బాలింత మృతి

- వైద్యుల నిర్లక్ష్యమే కారణమని బంధువుల ఆరోపణ
- మృతురాలి కుటుంబ సభ్యుల రాస్తారోకో



సుమలత(ఫైల్)



ఆందోళన చేస్తున్న మృతురాలి బంధువులు

ఆర్మూర్‌టౌన్: వైద్యం వికటించి బాలింత ప్రాణాలు కోల్పోయిన ఘటన శుక్రవారం వెలుగు చూసింది. వివరాలు.. మాక్లూర్ మండలం కల్లెడ గ్రామానికి చెందిన పిట్ల సుమలత అలియాస్ జయ(31) మూడో కాన్పు కోసం మామిడిపల్లిలోని తిరుమల ఆస్పత్రికి గురువారం కుటుంబ సభ్యులతో కలిసివచ్చారు. సుమలతను పరిశీలించిన వైద్యులు ఇప్పటికే డెలివరీ సమయం అయిపోయిందని, పరిస్థితి విషమయంగా ఉందని త్వరగా ప్రసవం చేయాలని సూచించారు. మధ్యాహ్నం 3 గంటలకు మగ బిడ్డకు జన్మనిచ్చింది. శిశువు ఉమ్మ నీరు మింగి ఉండటంతో పిల్లల ఆస్పత్రికి తీసుకెళ్లారు. అదే సమయంలో సుమలతకు కడుపులో మంట, నడుము నొప్పి తీవ్రమైంది. కుటుంబ సభ్యులు సుమలత పరిస్థితి వైద్యులకు వివరించారు. సుమలతకు చికిత్స చేసిన కొద్దిసేపటికే మృతిచెందింది. సుమలత చలనం లేకుండా పోవడంతో వైద్యులను నిలదీశారు. సుమలత మృతిచెందినట్లు వైద్యులు కుటుంబ సభ్యులకు తెలిపారు. అప్పటి వరకు బాగున్న సుమలత ఎలా మృతిచెందిందని, రెండు మార్లు మత్తు ఇంజక్షన్ ఇవ్వడం వల్లే సుమలత మృతిచెందిందని ఆరోపిస్తూ బంధువులు ఆందోళనకు దిగారు. శుక్రవారం ఉదయం ఐఎంఏ సభ్యులు ఆస్పత్రికి చేరుకొని బాధిత కుటుంబ సభ్యులతో చర్చలు జరిపినా వారు మాట వినలేదు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని న్యాయం జరిగేలా చూస్తామని చెప్పడంతో కుటుంబ సభ్యులు శాంతించారు.

చోరీ కేసులో ఇద్దరి అరెస్టు



వివరాలు తెలుపుతున్న పోలీసులు

మోర్తాడ్(బాల్కొండ): తిమ్మాపూర్‌లో రంగు శ్రీనివాస్‌గౌడ్, తుపాకుల రాకేశ్ ఇళ్లలో మూడు రోజుల కింద దొంగతనానికి పాల్పడిన ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేసినట్లు భీమ్‌గల్ సీఐ శ్రీనివాస్, మోర్తాడ్ ఎస్సై అనిల్ రెడ్డి తెలిపారు. శుక్రవారం పోలీసు స్టేషన్‌లో వారు మాట్లాడారు. తిమ్మాపూర్‌లోని రెండుఏ ఇండ్లలో తలుపులకు ఉన్న తాళాలను పగులగొట్టి బీరువాలో ఉన్న రెండున్నర మాసాల బంగారం, ఐదు తులాల వెండి, ఒక వాహనాన్ని దొంగిలించారని పోలీసులు తెలిపారు. కోటగిరి మండలం సుంకిని చెందిన చాకలి రాజు, అంకాపూర్‌కు చెందిన విబిత్వార్ గోపిలు ఈ నేరాలకు పాల్పడినట్లు తమ విచారణలో వెల్లడైందని తెలిపారు. బంగారం, వెండి, వాహనాన్ని నిందితుల నుంచి స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించినట్లు వెల్లడించారు.

అనారోగ్యంతో పీఏసీఎస్ చైర్మన్ మృతి



శేఖర్‌రెడ్డి(ఫైల్)

నిజామాబాద్‌రూరల్: జిల్లా కేంద్రంలోని కోటగల్లి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం చైర్మన్ ఎల్లసాని శేఖర్‌రెడ్డి(50) శుక్రవారం ఉదయం హైదరాబాద్‌లోని ప్రైవేట్ ఆస్పత్రిలో మృతిచెందాడు. కొంత కాలంగా శేఖర్‌రెడ్డి కాలేయ సంబంధిత వ్యాధితో బాధపడుతున్నట్లు వివరించారు. గతేడాది మే నెలలో చైర్మన్ పదవి చేపట్టారు. పీఏసీఎస్ సభ్యులు ఆయన కుటుంబానికి ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు.

విద్యుత్ షాక్‌తో రెండు గేదెలు..

ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని యానంగుట్ట సమీపంలో విద్యుత్ షాక్ తగిలి రెండు గేదెలు మృతిచెందాయి. గురువారం సాయంత్రం వీచిన గాలుల ధాటికి కరెంటు సర్వీస్ వైర్లు తెగిపోయాయి. అటు వైపు ఉన్న గేదెలు మేత వేసేందుకు వచ్చినప్పుడు వైర్లు తగిలి విద్యుత్ షాక్ కొట్టడంతో అక్కడిక్కడే మృతిచెందాయి. ఘటనా స్థలానికి ఆర్ఐ అశోక్ సింగ్ చేరుకుని పంచనామా నిర్వహించారు. పశువైద్యాధికారులు రెండు గేదెలకు పోస్టుమార్టం చేశారు. తమకు నష్టపరిహారం ఇప్పించాలని గేదెల యజమానులు కోరారు.

మద్యం స్వాధీనం

మోపాల్(నిజామాబాద్‌రూరల్): మండలంలోని కులాస్‌పూర్‌కు చెందిన గూండ్ల గంగారాం నుంచి 17 లీటర్ల మద్యం స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై గంగాధర్ శుక్రవారం తెలిపారు. వివరాలు.. నిజామాబాద్ నుంచి కులాస్‌పూర్ వైపు మద్యం సీసాలను గంగారాం తరలించేందుకు మోపాల్ చౌరస్తాలో ఆటో కోసం ఎదురుచూస్తుండగా అనుమానం వచ్చిన పోలీసులు తనిఖీలు చేశారు. అందులో 96 క్వార్టర్ సీసాల మద్యం స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపడుతున్నామని ఎస్సై తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడికి గాయాలు



క్షతగాత్రుడు తిరుపతి

నవీపేట : జన్నేపల్లి సమీపంలో శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో యువకుడికి తీవ్ర గాయాలైనట్లు గ్రామస్తులు తెలిపారు. వివరాలు.. నిర్మల్ జిల్లా ముథోల్ మండలంలోని బొమ్మిడిగావ్‌కు చెందిన తిరుపతి తన అత్త ఊరు మాక్లూర్ మండలంలోని చిక్లీ గ్రామానికి శుక్రవారం ఉదయం బైక్‌పై వచ్చారు. సాయంత్రం తిరుగు ప్రయాణంలో జన్నేపల్లి శివారులో బైక్ అదుపుతప్పి కింద పడ్డారు. తీవ్రగాయాలు కావడంతో గ్రామస్తులు 108 అంబులెన్స్‌లో జిల్లా కేంద్రంలోని ఆస్పత్రికి తరలించారు

ఇందల్వాయిలో మరొకరికి..



గాయపడ్డ బానాజీ

ఇందల్వాయి: ఇందల్వాయి–ధర్పల్లి మార్గంలో శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో వెంగల్‌పాడ్ గ్రామానికి చెందిన బానాజీ అనే వ్యక్తికి స్వల్ప గాయాలయ్యాయి. నిజామాబాద్‌కి చెందిన వ్యక్తులు ఇద్దరు కారులో ధర్పల్లి నుంచి నిజామాబాద్‌కి వెళ్తుండగా ద్విచక్రవాహనంపై ఇందల్వాయి వైపు వస్తున్న బానాజీని వెనక నుంచి ఢీకొట్టడంతో ప్రమాదం జరిగింది. కారులో ఉన్న ఇద్దరు పారిపోయేందుకు ప్రయత్నించగా తండావాసులు పట్టుకొని పోలీసులకు అప్పగించారు. గాయపడ్డ బానాజీని అంబులెన్స్‌లో ఆస్పత్రికి తరలించారు.

రైల్వే గేట్ తగిలి ఒకరికి తీవ్ర గాయాలు

- గేటు దాటి వెళ్లాలనే తొందరపాటుతోనే ఘటన



గాయపడ్డ కుర్మ మల్లయ్య

ఎడపల్లి (బోధన్): రైల్వే గేటు దాటుతుండగా ప్రమాదవశాత్తు గేటు తగిలి ఓ వ్యక్తి తీవ్రగాయాలపాలయ్యాడు. ఈ ఘటన ఎడపల్లి మండల కేంద్రంలో శుక్రవారం మధ్యాహ్నం చోటుచేసుకుంది. క్షతగాత్రుడు ఎడపల్లి మండల కేంద్రానికి చెందిన కురుమ మల్లయ్య గుర్తించారు. రైల్వే గేట్ తలకు బలంగా తగలడంతో తీవ్ర రక్త స్రావమైంది. గాయపడిన వ్యక్తిని స్థానికులు నిజామాబాద్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో బంధువులు ప్రభుత్వ ఆస్పత్రి నుంచి ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. మల్లయ్య పరిస్థితి విషమంగా ఉందని బంధువులు తెలిపారు. ఎడపల్లి నుంచి నిజామాబాద్‌కు వెళ్తున్న క్రమంలో ఈ ఘటన చోటు చేసుకుంది.

ఇసుక అక్రమ తరలింపు కేసులో ఇద్దరికి జైలు శిక్ష

ఎడపల్లి(బోధన్): మంజీర నది నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న కేసులో జరిమానా చెల్లించకపోవడంతో నిందితులను కోర్టులో హాజరుపర్చగా.. మేజిస్ట్రేట్ నెల రోజుల శిక్ష విధించినట్లు శుక్రవారం ఎస్సై వంశీచందర్ రెడ్డి తెలిపారు. వివరాలు.. 2019లో బోధన్ మండలం సాలూర నుంచి ఇసుక తరలిస్తుండగా పెట్రోలింగ్ పోలీసులు పట్టుకున్నారు. శుక్రవారం కోర్టులో నిందితులు బిల్లా హన్మాండ్లు, బిల్లా అభినయ్‌లను హాజరు పర్చగా మేజిస్ట్రేట్ సాయి శివ నెల రోజుల సాధారణ జైలు శిక్ష విధించారు. దీంతో పాటు రూ.2500 జరిమానా విధించారు. జరిమానా చెల్లించకుంటే మరో నెల రోజులు జైలు శిక్ష ఉంటుందని తీర్పులో పేర్కొన్నారు.